



TELANGANA SHASANA SABHA
TELTEL/2016/68867

తెలంగాణ
# శాసనసభ
తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 141 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | ఆదివారం 27 అక్టోబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-

# కేబినెట్ భేటీ కీలక నిర్ణయాలు

## అత్యంత పేదలకు ఇందిరమ్మ ఇళ్లు - ఉద్యోగులకు డీఏ



**శాసనసభ / హైదరాబాద్ :** సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సుదీర్ఘంగా సాగిన తెలంగాణ కేబినెట్ భేటీ ముగిసింది. దాదాపు నాలుగు గంటలకు పైగా కొనసాగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ప్రధానంగా మెట్రో రైల్ మార్గాల విస్తరణకు రూ. 24,269 కోట్లతో మెట్రో రెండో ఫేజ్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. నాగోల్ - ఎల్బీ నగర్ నుంచి హయత్‌నగర్ వరకు మెట్రో రైలు నిర్మాణానికి కేబినెట్ పచ్చజెండా ఊపింది. ఎల్బీ నగర్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో రైలు విస్తరణ కూడా ఆమోదం తెలిపింది.

- నాలుగు గంటలపాటు సాగిన కేబినెట్ భేటీ
- ఏటూరునాగారంను రెవెన్యూ డివిజన్‌గా మారుస్తూ కేబినెట్ తీర్మానం
- సమ్మక్క సారలమ్మ గిరిజన వర్సిటీకి 211 ఎకరాలను అప్పగిస్తూ తీర్మానం
- మెట్రో రైలు మార్గాల విస్తరణకు కేబినెట్ ఆమోదం

మిగతా »»2లో



## మేడారం సమ్మక్క, సారలమ్మ చిన్న
## జాతర తేదీలు ఖరారు

- ఈరోజు సమావేశమై తేదీలను ఖరారు చేసిన పూజారులు
- వచ్చే ఏడాది ఫిబ్రవరి 12 నుంచి నాలుగు రోజుల పాటు చిన్న జాతర
- మేడారం జాతర జరిగిన మరుసటి ఏడాది మినీ జాతర ఆనవాయతీ

2

### బెటాలియన్ పోలీసుల నిరసన...
## ఎస్పీ కాళ్లపై పడిన కానిస్టేబుల్



2

- సిరిసిల్ల కమాండెంట్ ఆఫీస్ వద్ద సర్దాపూర్ బెటాలియన్ పోలీసుల నిరసన
- రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు
- బెటాలియన్ వద్దకు వచ్చిన ఎస్పీ కాళ్ల మీద పడిన ఓ కానిస్టేబుల్

### హైదరాబాద్ అభివృద్ధిని చూసి కొంతమంది
## తట్టుకోలేకపోతున్నారు:



- అందుకే విషప్రచారం చేస్తున్నారని మండిపాటు
- మూసీ నిర్వాసితులకు జీవితం ఇవ్వాలనుకుంటున్నామని వెల్లడి
- నిర్వాసితులకు టవర్లు నిర్మించి, అందుబాటులో ఉంచుతామన్న భట్టివిక్రమార్క

2లో

### ఆ రెండింటి జోలికి వెళ్లొద్దు...
## పార్టీ నేతలకు చంద్రబాబు
## మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్

2లో



- మంగళగిరిలో టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభించిన బాబు
- మద్యం, ఇసుక వ్యవహారంలో ఎవరూ జోక్యం చేసుకోవద్దని హెచ్చరిక
- ఎవరైనా ఇసుక దందా చేస్తే తిరుగుబాటు చేయాలని కార్యకర్తలకు సూచన
- అలాగే మద్యం కూడా ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఆదేశం

## కొడంగల్‌లో కాంగ్రెస్ సర్కార్‌పై
## తిరుగుబాటు మొదలైంది

**శాసనసభ / హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే కాంగ్రెస్ సర్కారుపై తిరుగుబాటు మొదలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.కొడంగల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీపీ దయాకర్ రెడ్డితో పాటు..బీఎస్పీ తరపున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన నర్మద బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరందరికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. దాదాపు వంద మంది కాంగ్రెస్ కార్యకర్తలు కూడా కారెక్కారు.

2లో



## రేవంత్ కంటే చంద్రబాబు
## చాలా నయం..:
### మందకృష్ణ మాదిగ



**శాసనసభ / హైదరాబాద్ :** చేయూత పింఛన్‌దారులందరినీ వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) ఏకీకృతం చేసేందుకు ప్రయత్నం చేస్తోందని ఆ సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు.చేయూత పింఛన్ తీసుకునే వారిని రేవంత్ ప్రభుత్వం నట్టేట ముంచిందని విమర్శించారు. వీరితో కలిసి బలమైన ఉద్యమం చేపడతామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నమ్మిన పింఛన్‌దారులు కాంగ్రెస్‌ను గెలిపించారని చెప్పారు. 10 నెలలు అయినా..ఎందుకు పెంచి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. "ఏపీలో ఏప్రిల్ నెలలో మేం చంద్రబాబుకు వినతి పత్రం ఇచ్చాం.

వివరాలు »»2లో

### 'మహా' ఎన్నికలకు ఆప్ దూరం..
## మిత్రుల కోసం రంగంలోకి కేజ్రీవాల్

**ఢిల్లీ / శాసనసభ :** హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి ఖాతా తెరవడంలో విఫలమైన ఆమ్ ఆద్మీ పార్టీ.. మహారాష్ట్ర ఎన్నికల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది.అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయిం చిందని ఆ పార్టీ నేత సంజయ్ సింగ్ తెలిపారు.


మిగతా »»2లో



## పోటీ కొత్తేమో..
## పోరాటం కొత్త కాదు

2

**ఢిల్లీ /శాసనసభ:** ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి అరంగేట్రం చేసిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వయనాడ్ ఉప ఎన్నిక పోరుకు సిద్ధమవుతున్నారు.ఇటీవలే ఈ లోక్‌సభ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేశారు.ఈనేపథ్యంలో తాజాగా వయనాడ్ నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి ఓ భావోద్వేగభరిత పోస్ట్ చేశారు.



## తెలంగాణలో పత్తి రైతులకు గుడ్‌న్యూస్.. ఇక ఆ సమస్యలకు చెక్



**శాసనసభ / హైదరాబాద్ :** రోజురోజుకూ టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ ఎన్నో పనులను మనం ఇంట్లో ఉండి.. అరచేతిలో ఉన్న సెల్‌ఫోన్ ద్వారానే చేయగలుగుతున్నాం. ఇక రైతులకు కూడా వర్షాలు ఎప్పుడు పడతాయి..ఎలాంటి పంటలు వేయాలి.. ఇంట్లో ఉండి పొలం దగ్గర మోటార్ ఆన్ చేయడం, ఏ పంటకు ఏ ధర ఉంది అనే విషయాలే కాకుండా మరెన్నో సౌకర్యాలు ఇప్పుడు ఫోన్‌లోనే చూసుకునే సౌకర్యాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం పత్తి సీజన్ కావడంతో తెలంగాణ సర్కార్.. పత్తి రైతులకు మరిన్ని సౌకర్యాలు అందిస్తోంది. వాట్సప్ ద్వారా పత్తి పంట అమ్మకాలు, కొనుగోళ్లతోపాటు మొత్తం సమాచారాన్ని అరచేతిలో ఉన్న ఫోన్ ద్వారా తెలుసుకునే సౌకర్యాన్ని కల్పించింది.

## పోటీ కొత్తేమో.. పోరాటం కొత్త కాదు: ప్రియాంకగాంధీ వాద్రా

“కొన్ని నెలల క్రితం నేను, మా సోదరుడు రాహుల్‌తో కలిసి మండక్కై, చూరాల్‌మల వెళ్లాను. కొండచరియలు విరిగిపడటంతో ప్రకృతి సృష్టించిన బీభత్సం కారణంగా మీరు ఎదుర్కొన్న నష్టాన్ని, సర్వం కోల్పోయిన మీ ఆవేదనను కళ్లారా చూశా. పిల్లలను కోల్పోయిన తల్లులు, కుటుంబాన్ని కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులను చూశా. ఆ చీకటి రోజుల నుంచి బయటపడి నవశక్తితో మీరు ముందుకు కదిలిన తీరు స్ఫూర్తిదాయకం. నిస్సహాయ స్థితిలోనూ తోటి వారి కోసం మీరు పడిన ఆరాటం.. మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం. ఆ విషాద సమయంలో మీరు చూపించిన అచంచలమైన ధైర్య సాహసాలే.. ఈరోజు నాలో స్ఫూర్తిని నింపాయి. మీ తరఫున పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నా”.“నా సోదరుడికి మీరు ఎంతో ప్రేమను, అభిమానాన్ని పంచారు. అదే ప్రేమను నాపైనా కురిపిస్తారని ఆశిస్తున్నా. చట్టసభలో మీ గళాన్ని వినిపించే అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నా. చిన్నారుల భావి భవిష్యత్తు, మహిళల శ్రేయస్సు కోసం నా శక్తికి మించి కృషి చేస్తానని మాటిస్తున్నా. ప్రజాప్రతినిధిగా పోటీ చేసే ఈ ప్రయాణం నాకు కొత్త కావొచ్చు. కానీ, ప్రజల తరఫున గళం వినిపించేందుకు చేసే పోరాటం మాత్రం కొత్త కాదు. ఈ ప్రయాణంలో మీరంతా నాకు మార్గదర్శకంగా నిలుస్తారని ఆశిస్తున్నా” అని ప్రియాంకా గాంధీ రాసుకొచ్చారు.ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్ నుంచి పోటీ చేసిన రాహుల్‌గాంధీ.. సీపీఐ నాయకురాలు అన్నీరాజాపై 3.6 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాహుల్ రాజీనామాతో జరుగుతోన్న ఉప ఎన్నికలో ప్రియాంకాగాంధీ కాంగ్రెస్ తరఫున పోటీకి దిగారు. కేరళలో పాలక్కాడ్, చెలక్కర అసెంబ్లీ స్థానాలతోపాటు వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక నవంబర్ 13న జరగనుంది. నవంబర్ 23న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

## కొడంగల్‌లో కాంగ్రెస్ సర్కార్‌పై తిరుగుబాటు మొదలైంది : కేటీఆర్

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫార్మా సిటీని తీవ్రంగా వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత కొడంగల్‌లోనే ఫార్మా కంపెనీ ఏర్పాటుకు రంగం సిద్ధం చేయడంతో స్థానిక ప్రజలు తరిమికొట్టే పరిస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు. పాలమూరు .రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా కొడంగల్ నియోజకవర్గాన్ని తక్కువ ఖర్చుతో సస్యశ్యామలం చేసే ప్రణాళికలు పక్కనపెట్టి, కేవలం కమిషన్ల కోసం కొడంగల్ లిఫ్ట్ ప్రాజెక్టును చేపట్టారని మండిపడ్డారు. మొన్నటిదాకా రేవంత్ రెడ్డి తిట్టిపోసిన మెగా ఇంజనీరింగ్ కంపెనీకి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ కంపెనీకి కాంట్రాక్టు కట్టబెట్టడం వెనక ఉన్న మతలబు ఏంటో అర్థం చేసుకోవాలన్నారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు అనేక వర్గాల ధర్నాలు, రాస్తారోకోలతో తెలంగాణ అట్టడుకుతుంటే. మంత్రులు విహార యాత్రల్లో ఎంజాయ్ చేస్తున్నారని దుయ్యబట్టారు. చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.పదేళ్లు ప్రగతిపథంలో పరుగులు పెట్టిన తెలంగాణ రాష్ట్ర ఆదాయం తగ్గుతోందని, కాంగ్రెస్ నేతల ఆదాయం మాత్రం పెరుగుతోందని ధ్వజమెత్తారు. దీపం ఉన్నప్పుడే ఇళ్లు చక్కబెట్టుకోవాలనే ఆలోచనతో కాంగ్రెస్ నేతలు మూటలు నింపుకునే పనిలో మునిగితేలుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వ హెలికాప్టర్ ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో తిరిస్తోందని, ఇది అధికార దుర్వినియోగం కాకపోతే మరేంటని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా కలిసికట్టుగా పనిచేసి కొడంగల్‌లో కాంగ్రెస్ పార్టీని మట్టికరిపించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## రేవంత్ కంటే చంద్రబాబు చాలా నయం..:

దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలని కోరాం. ఆయన జూన్‌లో అధికారంలోకి రాగానే ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలవి ఇచ్చారు. ఏపీలో కండరాల క్షీణత ఉన్నవాళ్లకు రూ.15 వేల పింఛన్లు ఇస్తున్నారు. రేవంత్ కంటే చంద్రబాబు చాలా నయం. తెలంగాణలో వచ్చే నెల మొదటి వారంలో గడిచిన 10 నెలల బకాయిలతో పాటు నవంబర్ పింఛన్ ఇవ్వాలి. లేదంటే ఉద్యమం తప్పదు. నవంబర్ 1 నుంచి 16 వరకు ప్రతిరోజు రెండు జిల్లాల్లో చేయూత పింఛన్ లబ్ధిదారులకు చైతన్య సభలు నిర్వహిస్తాం. అప్పటికీ ఇవ్వకుంటే నవంబర్ 26న చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తాం 26న వికలాంగుల మహా గర్జన పేరిట వేలాది మందితో ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపడతాం. కాంగ్రెసేతర అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తాం. రేవంత్ ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకుంటాం” అని మందకృష్ణ అన్నారు.

## ‘మహా’ ఎన్నికలకు ఆప్ దూరం.. మిత్రుల కోసం రంగంలోకి కేజ్రీవాల్

మహా వికాస్ అఘాఢీ కూటమిలోని పార్టీలకు మద్దతుగా తమ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని చెప్పారు.మహారాష్ట్రతో పాటు ఝూరండ్ విషయంలోనూ ఆమ్ ఆద్మీ పార్టీ ఇదే వైఖరి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. హేమంత్ సోరెన్‌కు మద్దతుగా ఝూరండ్ ముక్తి మోర్చాకు కేజ్రీవాల్ ప్రచారం చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. మహారాష్ట్రలోని 288 స్థానాలకు నవంబర్ 20న పోలింగ్ జరనుండగా.. ఝురండ్‌లో 13, 20 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. 23న ఫలితాలు వెలువడనున్నాయి.భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి పోటీగా విపక్ష పార్టీలన్నీ ఇండియా కూటమి స్థాపించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా లోక్‌సభ ఎన్నికల్లో దిల్లీ, గుజరాత్, హరియాణా రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో కలిసి ఆప్ పోటీ చేసింది. ఒక్క పంజాబ్‌లో మాత్రం ఒంటరిగా బరిలోకి దిగింది. ఇటీవల జరిగిన హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం సొంతంగా పోటీ చేసి ఖాతా తెరవడంలో విఫలమైంది. తాజాగా మహారాష్ట్ర, ఝురండ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా నిలిచింది.

## నాకు చెప్పనేలేదు.. పార్టీ ఫిరాయింపులపై మరోసారి కాంగ్రెస్ జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



**శాసనసభ / హైదరాబాద్ :** ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ ఫిరాయింపుల కారణంగా తనలాంటి ఒరిజినల్ కాంగ్రెస్ లీడర్ల ఆత్మస్థైర్యాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ఫిరాయింపుల ద్వారా కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన నేతలు స్థానికంగా రెచ్చిపోతున్నారని ఆరోపించారు.పార్టీ ఫిరాయింపులను గత కొంతకాలంగా వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి.. తన అనుచరుడు గంగారెడ్డి హత్యతో అసమ్మతిని బహిరంగంగా వెల్లగక్కాడు. కాంగ్రెస్ పెద్దలు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వినిపించుకోవడం లేదు. దీంతో ఆయన్ను బుజ్జగించేందుకు టీపీసీసీ ప్రచార కార్యదర్శి మధుయాష్కీ గౌడ్ శుక్రవారం జగిత్యాలకు వెళ్లారు. అక్కడ జీవన్ రెడ్డిని కలిసి ఆయన్ను పరామర్శించారు. అనంతరం ఇద్దరూ కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగానే జీవన్ రెడ్డి తన అసహనాన్ని వ్యక్తం చేశారు. ఫిరాయింపుల కారణంగా తమ ఆత్మస్థైర్యాన్ని కోల్పోయామని అన్నారు. తనకు చెప్ప కుండానే జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను పార్టీలో చేర్చుకున్నారని తెలిపారు. కాంగ్రెస్‌లోకి వచ్చాక ఆయన రెచ్చిపోయారని అన్నారు. పార్టీ ఫిరాయింపుల కారణంగానే గంగారెడ్డిని కోల్పోవాల్సి వచ్చిందని విచారం వ్యక్తంచేశారు.మధుయాష్కీ గౌడ్ కూడా పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌లోకి వస్తున్న వారు ఎవరూ కూడా పార్టీపై ప్రేమతో రావడం లేదని తెలిపారు. తమ స్వలాభం కోసం, అక్రమాస్తులను కాపాడుకోవడం కోసమే అధికార పార్టీలోకి వస్తున్నారని అన్నారు. అలా వచ్చిన వాళ్లెవరికీ కాంగ్రెస్ సిద్ధాంతాలపై విశ్వాసం లేదని మండిపడ్డారు.

## నవంబర్ 30లోపు కులగణన.. పీపీపీ విధానంలో రోడ్ల నిర్మాణం.. తెలంగాణ క్యాబినెట్ నిర్ణయాలివే



**శాసనసభ / హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.దాదాపు నాలుగు గంటలకు పైగా కొనసాగిన సమావేశంలో పలు కీలక అంశాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది.ఈ మేరకు క్యాబినెట్ నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ మీడియాకు వెల్లడించారు.క్యాబినెట్ నిర్ణయాలివే...ఏటూరు నాగారంను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ క్యాబినెట్ తీర్మానం సమ్మక్క సారలమ్మ ట్రైబర్ వర్సిటీకి 211 ఎకరాలు అప్పగిస్తూ తీర్మానం మెట్రో రైలు మార్గాల విస్తరణకు క్యాబినెట్ ఆమోదం.నాగోల్ - ఎల్బీనగర్, ఎల్బీనగర్ - హయత్‌నగర్, ఎల్బీనగర్ - శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో విస్తరణకు ఆమోదం నవంబర్ 30లోపు కులగణన పూర్తికి నిర్ణయం పేదవాళ్లలో అతి పేదవాళ్లకు ఇందిరమ్మ ఇళ్లు దీపావళి కానుకగా ఈనెల 31న ఇళ్ల కేటాయింపు దీపావళి కానుకగా ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డీఏ 6 వేలకు పైగా ధాన్యం సేకరణ కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం స్పౌజ్, హెల్త్, మ్యూచువల్ ప్యాటర్న్‌లో ఉద్యోగుల బదిలీలకు ఆమోదం పీపీపీ విధానంలో రోడ్ల నిర్మాణానికి నిర్ణయం ఉస్మానియా ఆస్పత్రికి గోషామహల్‌లో స్థలం ఇవ్వాలనే నిర్ణయానికి ఆమోదం గచ్చిబౌలి స్టేడియాన్ని స్పోర్ట్స్ వర్సిటీకి వాడాలని క్యాబినెట్ నిర్ణయం 8 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొత్త కోర్టులకు సిబ్బంది కేటాయింపునకు నిర్ణయం.

## కేటీఆర్‌తో ఉన్నవారు మాతో టచ్‌లో ఉన్నారు.. కాంగ్రెస్‌లో చేరికలు ఉంటాయి



**శాసనసభ / హైదరాబాద్ :** ప్రభుత్వం ఉన్న చోటే పార్టీ బలంగా ఉండాలని హైకమాండ్ చెప్పిందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఇవాళ ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ..నూతన కార్యవర్గం పై, పార్టీ ముఖ్యనేతలతో విస్తృత చర్చ జరగాలని, ఆచితూచి కమిటీ వెయ్యాల్సిన అవసరం ఉంది. సమర్థులను జిల్లా అధ్యక్షులుగా నియమిస్తాం అని మహేష్ గౌడ్ అన్నారు. మంత్రివర్గ విస్తరణ నాపరిధిలోది కాదు , సీఎం, ఏఐసీసీలు కలిసి నిర్ణయం తీసుకోవాలన్నారు. నవంబర్ చివరి నాటికి తెలంగాణ కాంగ్రెస్ కార్యవర్గ విస్తరణ ఉండొచ్చన్నారు. సమర్థులను జిల్లా అధ్యక్షులుగా నియమిస్తామని ఆయన తెలిపారు. కొన్ని చోట్ల ఎమ్మెల్యేలకు జిల్లా అధ్యక్షులుగా అవకాశం ఇస్తామని, కొత్త వాళ్ళు వచ్చిన చోట వాళ్ళను గౌరవించుకోవాలన్నారు. పాత కొత్త కలయిక తో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని ఆయన అన్నారు. కొత్త పాత నాయకులను మిక్స్ చేయాలని, కాంగ్రెస్ లో చేరికలు ఉంటాయన్నారు. చాలా మంది ఎమ్మెల్సేలు, ముఖ్యనేతలు కాంగ్రెస్ లో చేరేందుకు ఆసక్తిగా ఉన్నారని, కేటీఆర్ తో రోజు ఇన్ అండ్ అవుట్ టచ్ లో ఉన్న వాళ్ళు.. మాతో టచ్ లో ఉన్నారన్నారు మహేష్ కుమార్ గౌడ్. ప్రభుత్వాన్ని కూలుస్తాం అని అన్నారు.. అందుకే చేరకలు జరిగాయని, ప్రభుత్వానికి, పార్టీకి మధ్య మంచి కోఆర్డినేషన్ ఉందన్నారు మహేష్ కుమార్.అంతేకాకుండా..’మాకు ఫైనల్ ఎన్నికలు 2028 లో ..రాష్ట్రంలో కాంగ్రెస్.. దేశంలో కాంగ్రెస్ గెలవాలి.. రాహుల్ పీఎం కావాలి.. బీసీ గణన పై కామన్ మ్యాన్ లా రిపోర్ట్ కావాలి.. రాహుల్ గాంధీ కూడా సీరియస్ గా ఉన్నారు.. తెలంగాణాలో బీసీ గణనపై కన్వెన్షన్. బీసీ గణన సదస్సుకు రాహూల్ , ఖర్గేలు హాజరవుతారు. బీసీ కుల గణన పై రాహుల్ లైన్ లోనే సిఎం, నేను ఉన్నాం. కులగణన జరిగితే ఎవరి వాటా వాళ్ళకే వస్తది. మల్లన్న తో మాట్లాడాను.. బీసీలకు న్యాయం కోసం పార్టీ పై కొన్ని అంశాల్లో డివేట్ అవుతున్నారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియాను ఇష్టారాజ్యంగా వాడుతోంది. సోషల్ మీడియాను అనైతికంగా ఉపయోగిస్తున్నారు.హైడ్రా, మూసీ విషయంలో ప్రజలను రెచ్చగొట్టేలా పోస్టులు పెడ్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టులతో మిస్ లీడ్ చేస్తున్నారు.. దుబాయ్.. సింగపూర్ నుంచి సోషల్ మీడియాను హ్యాండిల్ చేస్తున్నారు.పొంగులేటి ఏ బాంబు పేలుస్తారో చూడాలి. విచ్చల విడిగా అవినీతికి పాల్పడ్డ అధికారులపై చర్యలు కోసం జనం చూస్తున్నారు. కేటీఆర్ కు రెండేళ్లు కాదు.. పదేళ్ల శిక్ష పడే తప్పులున్నాయి. కాళేశ్వరం అంత ఖర్చు పెట్టి కట్టింది.. కమిషన్ల కోసమే.. అన్యాయంగా ఎవర్ని శిక్షంచం.. తప్పు చేసిన వాళ్లకు మాత్రం శిక్షపడాలి. విద్యుత్ అప్పటి కంటే చాలా తక్కువ ధరకు కొంటున్నం. విద్యుత్ కొనుగోళ్ళలో అవకతవకలు జరిగాయి. కేసీఆర్ కు ఉన్న ఆర్థిక వెసలుబాటు మాకు లేదు. ఆర్థికంగా నిర్బంధం ఉంది.. వచ్చే అధ్యాయంలో వడ్డిలకే ఎక్కువ కట్టాల్సి వస్తోంది. కేసీఆర్ లాగా మోసం చెయ్యాం.. ఇచ్చిన హామీలు అమలు చేస్తాం.. జీవన్ రెడ్డి నరనరాన కాంగ్రెస్ భావజాలమే ఉంది. జీవన్ రెడ్డి తన అనుచరుడి మర్డర్ తర్వాత ఆవేదనకు గురయ్యారు. జీవన్ రెడ్డి ఒంటరి కాదు మేమంతా ఆయన వెంట ఉన్నాం. 13 సార్లు జీవన్ రెడ్డికి కాంగ్రెస్ బి ఫాం ఇచ్చింది. కొడంగల్ చేరికలపై.. బీఆర్‌ఎస్‌లో ఏముందని చేరతారు.. వ్యక్తుల గురించి మాట్లాడటం సరికాదు..కడుపు మండి సురేఖ అలా మాట్టాడారు.. వెంటనే వెనక్కి తీసుకున్నారు.. ముగిసిన అధ్యాయం.. మూసీ ప్రాజెక్టుకు లక్షా యాభై వేల కోట్లు అని ఎవరు చెప్పారు.. కావాలని అబద్ధపు ప్రచారం చేస్తున్నారు.. నెహ్రూ తర్వాత విజన్ తో అభివృద్ధి చేసింది నిజాం.. గత పదేళ్లలో 1500 చెరువుల్లో కబ్జా జరిగింది.. పెద్ద ప్రళయం వస్తె జనం ఇబ్బంది పడతారు.. అందుకే మూసి నీ యుద్ధ ప్రాతిపదికన తీసుకున్నారు.. పెద్దవాళ్ళకు నష్టం జరక్కుండా ఉండాలనేది మా ఆలోచన.. సీఎం స్టడీ చేస్తున్నారు.. హైడ్రా, మూసీ విషయంలో ప్రతిపక్షాల రాద్ధాంతం చేస్తున్నాయి.. పెద్దవాళ్ళకు అన్యాయం జరక్కుండా కచ్చితంగా.. ప్రాజెక్టులు ముందుకు పోతాయి..రతన్ టాటా నిస్వార్థ సేవ చేశాడు.. ఫోన్ ట్యాపింగ్ తీవ్రమయిన కేసు.. డ్రగ్స్ విషయంలో కూడా ఎవ్వరినీ వదలం.. గత ప్రభుత్వం లెక్కలు చూస్తే.. చూసి చూసి ఆర్థిక మంత్రి భట్టికి బీసీ వచ్చింది.. రియల్ ఎస్టేట్ కూడా త్వరలో పుంజుకుంటది.. దేశంలో నంబర్ వన్ గా ఉంటుంది.. జనాభా ప్రకారం డిలిమిటేషన్ వద్దని కాంగ్రెస్ చెప్తుంది.. జనాభా తక్కువ ఉన్న దేశాలు అభివృద్ధి చెందుతున్నాయి.. మహారాష్ట్రలో పార్టీ పేరుతో కేసీఆర్ డబ్బులు వేస్ట్ చేశారు’ అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

( మొదటి పేజీ తరువాయి )

## మేడారం సమ్మక్క, సారలమ్మ చిన్న జాతర తేదీలు ఖరారు

మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతర తేదీలు ఖరారయ్యాయి. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం మినీ జాతరను వచ్చే ఏడాది ఫిబ్రవరి 12వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించాలని మేడారం పూజారులు నిర్ణయించారు. మేడారం జాతర రెండేళ్లకోసారి జరుగుతుంది. ఈ జాతరకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా అమ్మవార్ల దర్శనం కోసం వస్తారు.మేడారం జాతర జరిగిన ఏడాది తర్వాత చిన్న జాతరను నిర్వహిస్తారు. ఇది ఆనవాయతీగా వస్తోంది. ఈరోజు సమావేశమైన పూజారులు తేదీలను ప్రకటించారు. జాతరకు సంబంధించిన ఏర్పాట్లను ప్రారంభించాలని రాష్ట్ర దేవాదాయ శాఖను మేడారం పూజారుల సంఘం కోరింది.

## కేబినెట్ భేటీ కీలక నిర్ణయాలు : అత్యంత పేదలకు ఇందిరమ్మ ఇళ్లు - ఉద్యోగులకు డీఏ

ఏటూరునాగారంను రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, సమ్మక్క సారలమ్మ గిరిజన వర్సిటీకి 211 ఎకరాలు అప్పగిస్తూ కేబినేట్ అంగీకారం తెలిపింది. ఈ నెల 31న ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తాం : పేదవాళ్లలో అతి పేదవాళ్లకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీపావళి కానుకగా ఈ నెల 31న ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని వివరించారు. అదేవిధంగా దీపావళి పర్వదిన సందర్భంగా ఉద్యోగులకు ఒక డీఏ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. మరోవైపు నవంబర్ 30లోపు కులగణన పూర్తి చేయాలని, రూ.6 వేలకు పైగా ధాన్య సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించిందని తెలిపారు.

**మరికొన్ని కేబినెట్ నిర్ణయాలివే :**

మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కేబినెట్ పచ్చజెండా
పీపీపీ విధానంలో రోడ్ల నిర్మాణానికి నిర్ణయం
ఉస్మానియా ఆస్పత్రికి గోషామహల్‌లో స్థలం ఇవ్వాలని ఆమోదం
గచ్చిబౌలి స్టేడియాన్ని స్పోర్ట్స్ వర్సిటీకి వాడాలని నిర్ణయం
8 ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన కొత్త కోర్టులకు సిబ్బంది ఇవ్వాలని నిర్ణయం

## బెటాలియన్ పోలీసుల నిరసన... ఎస్పీ కాళ్లపై పడిన కానిస్టేబుల్

ఓ బెటాలియన్ పోలీసు సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ కాళ్లపై పడ్డారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణవ్యాప్తంగా బెటాలియన్ పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తోన్న విషయం తెలిసిందే. ఒకే పోలీస్ విధానాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.
సర్దాపూర్‌లోని తెలంగాణ స్పెషల్ పోలీస్ (ఏఆర్) 17వ బెటాలియన్‌కు చెందిన ఆర్మ్ డ్ రిజర్వ్ కానిస్టేబుళ్లు శనివారం నాడు సిరిసిల్ల కమాండెంట్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. సీఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళన చేస్తున్న బెటాలియన్ పోలీసుల వద్దకు సిరిసిల్ల ఎస్పీ మహాజన్ వచ్చారు.
బెటాలియన్ పోలీసులను ఆందోళన విరమించాలని ఎస్పీ కోరారు. ఈ సమయంలో ఓ కానిస్టేబుల్ తమకు న్యాయం కావాలంటూ ఎస్పీ కాళ్ల మీద పడ్డాడు. ఎస్పీ, అతని గన్‌మన్‌లు అతనిని పైకి లేపే ప్రయత్నం చేసినప్పటికీ అతను పైకి లేవలేదు. మమ్మల్ని కాపాడండి సర్... మాకు న్యాయం చేయండి సర్ అంటూ కంటతడి పెట్టుకున్నారు. కానిస్టేబుళ్లు ఎన్నో బాధలు అనుభవిస్తున్నారని ఆయన ఏడుస్తూ చెప్పారు. ఉన్నతాధికారుల ఇళ్లలో బలవంతంగా పని చేయిస్తున్నారని వారు వాపోయారు.


## హైదరాబాద్ అభివృద్ధిని చూసి కొంతమంది తట్టుకోలేకపోతున్నారు: భట్టివిక్రమార్క

హైదరాబాద్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసి కొంతమంది తట్టుకోలేక పోతున్నారని, అందుకే విషప్రచారం చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలోని నిర్వాసితులకు మంచి జీవితాన్ని ఇవ్వాలనే కృతనిశ్చయంతో తమ ప్రభుత్వం ఉందన్నారు. నిర్వాసితులకు అద్భుతమైన టవర్స్ నిర్మించి అందులో ఉంచుతామని, వారి పిల్లలకు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తామన్నారు. బాధిత డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని తెలిపారు.ప్రాపర్టీ షోను సందర్శించిన భట్టివిక్రమార్కన రెడ్కో నిర్వహిస్తున్న ప్రాపర్టీ షోను భట్టివిక్రమార్క సందర్శించారు. రియాల్టీ వ్యాపారుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బ్యాంకర్లతో చర్చించి రుణం అందేలా చూస్తామన్నారు. హైడ్రాపై ప్రతిపక్షాలు అనవసరంగా దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. పార్కులు, చెరువులు, గుట్టలను రక్షించేందుకే హైడ్రా అని స్పష్టం చేశారు.

## ఆ రెండింటి జోలికి వెళ్లొద్దు... పార్టీ నేతలకు చంద్రబాబు మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్


ఏపీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన చంద్రబాబు మరోసారి పార్టీ నేతలు, కార్యకర్తలకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మద్యం, ఇసుక వ్యవహారంలో ఎవరూ జోక్యం చేసుకోవద్దని హెచ్చరించారు. ఎవరైనా ఇసుక దందా చేస్తే తిరుగుబాటు చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఇసుక విధానంలోకి చొరబడి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని వైసీపీ కుట్ర చేస్తుందని బాబు పేర్కొన్నారు. అలాగే మద్యం కూడా ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని తెలిపారు. ఎవరైనా ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయన్నారు.గత వైసీపీ పాలనలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారని, వారి త్యాగాలను గుర్తుంచుకుని సముచిత న్యాయం చేస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికే పదవులు ఇస్తున్నట్లు బాబు చెప్పుకొచ్చారు. ఇటీవల జరిగినవి ఎన్నికలు కాదని రాక్షసుడితో యుద్ధమని పేర్కొన్నారు. పార్టీకి గ్రామం నుంచి రాష్ట్రం వరకూ పటిష్టమైన యంత్రాంగం ఉందన్నారు. నాలుగు దశాబ్దాల్లో ఎన్నో సంక్షోభాలు దాటామని తెలిపారు. అలాగే పార్టీ ఆవిర్భావం నుంచి పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు.

# కిడ్నీలో రాళ్లను బయటకు పంపే సహజ పద్ధతులు ఇవే..



ప్రస్తుత రోజుల్లో కిడ్నీలో రాళ్లు ఉండడం కామన్ సమస్యగా మారింది. అయితే.. దీన్ని సీరియస్‌గా తీసుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే.. కిడ్నీ శరీరంలోని చాలా ముఖ్యమైన అవయవంలో ఒకటి.ఇది రక్తాన్ని ఫిల్టర్ చేయడానికి పనిచేస్తుంది. రక్తాన్ని ఫిల్టర్ చేసేటప్పుడు సోడియం, కాల్షియం, ఇతర ఖనిజాల సూక్ష్మ కణాలు మూత్రంతో శరీరం నుంచి బయటకు వెళ్తాయి. అయితే రక్తంలో కాల్షియం, భాస్వరం, సోడియం, ఇతర ఖనిజాల పరిమాణం పెరిగినప్పుడు అది రక్తంలో పేరుకుపోతుంది.దాంతో వాటిని మూత్రపిండాలు రాళ్లను ఏర్పరుస్తాయి. ఇది ఒక సాధారణ సమస్య. కానీ., తీవ్రమైన వ్యాధి. ఈ సమస్యను తగ్గించే సహజ పద్ధతుల గురించి తెలుసుకుందాం..ముందుగా రాళ్ల పరిమాణం, వ్యాధి స్థితి గురించి తెలుసుకునేందుకు వైద్యుడిని సంప్రదించాలి. వైద్యుడి సూచనలతో పాటు ఈ సహజ పద్ధతులు పాటించాల్సి ఉంటుంది. ఆపిల్ వెనిగర్ లోని సిట్రిక్ యాసిడ్ కిడ్నీ రాళ్లను చిన్న ముక్కలుగా విడగొడుతుంది. మూత్రాశయం గుండా రాళ్లు బయటకు వెళ్లేందుకు సహకరిస్తుంది. ఆపిల్ సీడర్ వెనిగర్ తీసుకోవడం వల్ల కిడ్నీల నుంచి ట్యాక్సిన్లు బయటకు వెళ్లి శుద్ధి అవుతాయి. రాళ్లు తొలగిపోయే వరకు రెండు టేబుల్ స్పూన్ల ఆపిల్ సీడర్ వెనిగర్‌ను వెచ్చని నీటిలో కలిపి తీసుకోవడం మంచిది.ఎండబెట్టిన తులసి ఆకులను పొడిగా నలిపండి. ఒక టేబుల్ స్పూన్ పొడిని నీటిలో కలిపి తేనీరు తయారు చేయండి. ఈ టీని రోజులో మూడు సార్లు తాగండి. ఇది కడుపులోని ఎసిటిక్ యాసిడ్‌ను విచ్ఛిన్నం చేస్తుంది. దీని వల్ల కిడ్నీలోని రాళ్లు సైతం విచ్ఛిన్నమై సులభంగా బయటకు పోతాయి. కిడ్నీ బీన్స్ కూడా మూత్ర పిండాల్లో రాళ్లను బయటకు పంపేందుకు సహకరిస్తాయి. కిడ్నీ బీన్స్‌ను 8 నుంచి 12 గంటలు నీటిలో నానబెట్టి ఉడకబెట్టి తినండి. కిడ్నీ బీన్స్‌లో ఉండే ఫైబర్ మూత్ర పిండాల్లోని రాళ్లను బయటకు గెంటేస్తాయి. రోజులో ఒక్కసారైనా వీటిని తీసుకోండి.

# కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక ప్రకటన




**శాసనసభ / హైదరాబాద్ ప్రతినిధి :** కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కీలక ప్రకటన చేశారు. భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించని వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. నగరంలో చెరువులను, కాలువలను, ఫుట్‌పాత్‌లను, ప్రభుత్వ స్థలాలను కాపాడుతూ..నగర ప్రజలకు మెరుగైన జీవనాన్ని ఇచ్చేందుకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన హైడ్రాకు నేటితో వందరోజులు పూర్తి చేసుకుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు ముందుకు సాగుతూ.. చెరువులకు పునరుజ్జీవనం ఇచ్చేందుకు హైడ్రా చేస్తున్న ప్రయత్నంలో మీడియా అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు ఏవీ రంగనాథ్. కొన్ని మీడియా సంస్థలు, మరికొంత మంది సోషల్ మీడియా పనికట్టకుని హైడ్రాపై తప్పుడు ప్రచారం చేసి.. ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చే ప్రయత్నంచేస్తోందని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో హైడ్రా చర్యలపై క్లారిటీ ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ అనుమతులున్న భవనాలను హైడ్రా కూల్చదని, సర్వే నంబర్లు మార్చేసి.. తప్పుడు సమాచారంతో అనుమతులు పొంది.. భూములు, చెరువులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై హైడ్రా చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు.అంతేకాకుండా..'హైడ్రా కూల్చిన తర్వాత ఆ వ్యర్థాలను సదరు బిల్డరే తొలగించాలి.. లేని పక్షంలో వారిపై హైడ్రా చర్యలు తీసుకుంటుంది.. ఇప్పటికే పలువురికి నోటీసులు కూడా ఇచ్చింది.. కొంతమంది నిర్మాణ వ్యర్థాలను తొలగిస్తుండగా.. మరి కొందరు అలసత్వం ప్రదర్శిస్తున్నారు.. మరి కొంతమంది అక్కడ ఉన్న విలువైన ఇనుప చువ్వలు, ఇతర సామగ్రిని తీసుకుని వ్యర్థాలను వదిలేస్తున్నారు.. అక్కడ పూర్వ స్థితికి భూమిని తీసుకురావాల్సిన బాధ్యత బిల్డర్లపైనే ఉంది.. విలువైన వస్తువులు తీసుకెళ్లి మిగతా వ్యర్థాలను అక్కడే వదిలేయడాన్ని హైడ్రా తీవ్రంగా పరిగణిస్తోంది.. చెరువులకు పునరుజ్జీవనం కల్పించే క్రమంలో హైడ్రానే చొరవచూపి.. అక్కడ నిర్మాణ వ్యర్థాలను తొలగిస్తోంది.. ఇందుకు అయ్యే ఖర్చును నిర్మాణదారుడి నుంచి వసూలు చేస్తుంది.. నిర్మాణ వ్యర్థాల తొలగింపు ప్రక్రియను కూడా టెండర్ల ద్వారా పిలిచి అప్పగించడమౌతోంది.. ఇంకా మిగిలిపోయిన ఇనుప చువ్వలను వేరుచేసి.. వ్యర్థాలను తొలగిస్తున్నారు.. వాస్తవాలు ఇలా ఉంటే.. కొన్ని మీడియా సంస్థలు హైడ్రా చర్యల పట్ల ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి.. వాస్తవాలు తెలుసుకోకుండా.. ప్రచారం చేస్తున్నాయి.. ఉదాహరణకు నిజాంపేట మున్సిపల్ పరిధిలోని ఎర్రకుంట చెరువులో సర్వే నంబర్లు వేరేవి చూపించి.. తప్పుడు సమాచారంతో ఎర్రకుంట చెరువులోని ఎఫ్‌టీఎల్ పరిధిలోని సర్వే నంబర్లు 48, 49లో నిర్మించిన 5 అంతస్తుల 3 భవనాలను ఆగస్టు 14వ తేదీన హైడ్రా కూల్చిన విషయం విధితమే..ఎర్రకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో 5 అంతస్తుల 3 భవనాలను నిర్మించిన సుధాకర్‌రెడ్డి పై ఇరిగేషన్ విభాగం అధికారులు బాచుపల్లి పోలీసు స్టేషన్లో కేసు కూడా పెట్టారు.. ఎర్రకుంట చెరువులో నిర్మించిన భవనాల వ్యర్థాలను తొలగించాలని సదరు నిర్మాణదారుడు సుధాకర్ రెడ్డికి నోటీసులు కూడా హైడ్రా జారీ చేసింది.. అయితే విలువైన వస్తువులను తీసుకెళ్లి.. భవన వ్యర్థాలను అక్కడే సదరు నిర్మాణదారుడు వదిలేశారు.. ఎర్రకుంట చెరువుకు పునరుజ్జీవనం ఇచ్చే క్రమంలో.. అక్కడ వదిలేసిన వ్యర్థాలను తొలగించే పనికి హైడ్రా టెండర్లు పిలిచింది.. పిల్లర్ల మధ్యన ఉన్న ఇనుప చువ్వలను తొలగించి.. వాటిని అమ్మగా వచ్చిన డబ్బును మినహాయించి.. డెబ్రీస్‌ను ఎత్తడానికి ఎంత అయ్యిందో అంత చెల్లించాలని హైడ్రా నిర్ణయించింది.. ఇదే మొత్తాన్ని భవన నిర్మాణదారుడిని నుంచి వసూలు చేస్తుంది.. నగరంలో ట్రాఫిక్, వరద నీటి సమస్య పరిష్కారానికి హైడ్రా కృషి చేస్తోంది.. ఈ క్రమంలో వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటోంది..' అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు.

# రోజూ ఒక స్పూన్ నెయ్యిని ప్రతి ఒక్కరూ తినాల్సిందే.. ఎందుకో తెలుసా..?



భారతీయులు ఎంతో పురాతన కాలం నుంచే నెయ్యిని ఉపయోగిస్తున్నారు. చిన్నారులకు నెయ్యిని ఎక్కువగా పెడుతుంటారు. దీని వల్ల వారికి పోషకాలు, బలం అందుతాయని భావిస్తారు.

అది నిజమే. అయితే నెయ్యిని పూర్వకాలంలో అందరూ తినేవారు. కానీ ఇప్పుడు మాత్రం కేవలం చిన్నారులకే పెడుతున్నారు. అయితే నెయ్యిని అందరూ తినాల్సిందే. ముఖ్యంగా రోజూ ఒక టీస్పూన్ మోతాదులో అయినా సరే నెయ్యిని తినాలని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. నెయ్యిని రోజువారి ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చని వారు అంటున్నారు. ఈ క్రమంలోనే రోజూ ఒక టీస్పూన్ నెయ్యి తింటే ఏం జరుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.

**జీర్ణ సమస్యలకు చెక్..**

నెయ్యిని క్రీస్తుపూర్వం 1500 నుంచి 500 సంవత్సరాల మధ్య విస్తృతంగా ఉపయోగించినట్లు చరిత్ర చెబుతోంది. అందువల్ల నెయ్యి దివ్యౌషధమని చెప్పవచ్చు. ఇందులో అనేక పోషకాలు ఉంటాయి. నెయ్యిని కూరల్లో వేసి తినడం వల్ల కూరలు చక్కని రుచిని పొందుతాయి. దీంతో పిల్లలే కాదు, పెద్దలు కూడా ఒక ముద్ద ఎక్కువే తింటారు. ఇక నెయ్యి మనం తిన్న ఆహారాన్ని జీర్ణం చేయడంలో ఎంతో అద్భుతంగా పనిచేస్తుంది. ఇది జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తుంది. ముఖ్యంగా అజీర్తి, కడుపు ఉబ్బరం, గ్యాస్, మలబద్దకం ఉన్నవారు రోజూ ఒక టీస్పూన్ నెయ్యి తింటే ఫలితం ఉంటుంది. ఆయా సమస్యల నుంచి బయట పడవచ్చు. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యాన్ని పెంపొందించడంలో నెయ్యి ఎంతగానో పనిచేస్తుంది.

**కంటి చూపు పెరుగుతుంది..**

ఇక మనం తినే ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకోవడంలో నెయ్యి అద్భుతంగా పని చేస్తుంది. నెయ్యిలో విటమిన్లు ఎ, డి, ఇ, కె సమృద్ధిగా ఉంటాయి. ఇవి మనల్ని రోగాలు రాకుండా చూస్తాయి. ముఖ్యంగా నెయ్యిలో ఉండే విటమిన్ ఎ కంటి చూపును మెరుగు పరుస్తుంది. విటమిన్ డి ఎముకలను బలంగా మారుస్తుంది.అలాగే విటమిన్ ఇ వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది,రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. నెయ్యి వల్ల మనకు విటమిన్ కె లభిస్తుంది. ఇది గాయాలు అయినప్పుడు రక్తం త్వరగా గడ్డ కట్టేలా చేస్తుంది. ఇలా నెయ్యి వల్ల బహు విధాలుగా మనకు ప్రయోజనాలు కలుగుతాయి.

**అధిక బరువు తగ్గుతారు..**

ఇక నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. అందువల్ల రోజుకు ఒక టీస్పూన్ మోతాదులో నెయ్యిని తింటే మన శరరీంలో ఎల్‌డీఎల్ అంటే చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ అంటే హెచ్‌డీఎల్ పెరుగుతుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారికి నెయ్యి మంచి ఆప్షన్ అని చెప్పవచ్చు. ఇది అతిగా ఆహారం తినకుండా చూస్తుంది. దీంతో బరువు తగ్గడం తేలికవుతుంది. నెయ్యిని తినడం వల్ల ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. దీంతో సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. ముఖ్యంగా దగ్గు, జలుబు నుంచి బయట పడవచ్చు. ఇలా నెయ్యిని రోజూ ఒక టీస్పూన్ మోతాదులో తినడం వల్ల అనేక లాభాలు పొందవచ్చు. అయితే నెయ్యి ఆరోగ్యకరమే అయినప్పటికీ కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు, గుండె జబ్బులు ఉన్నవారు మాత్రం డాక్టర్ సలహా మేరకు నెయ్యిని తీసుకోవాల్సి ఉంటుంది. ఇక మిగిలిన ఎవరైనా సరే నెయ్యిని రోజూ ఒక టీస్పూన్ మోతాదులో నిరభ్యంతరంగా తినవచ్చు. నెయ్యిని తింటే అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటారు.

# దుండిగల్‌లో అసైన్డ్ భూముల ఆందోళన.. అధికారులపై ఎంపీ ఈటల ఫైర్

**శాసనసభ / హైదరాబాద్ ప్రతినిధి :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ మున్సిపాలిటీ దుండిగల్ గ్రామంలో సర్వే నెంబర్ 453, 454 లలో ఉన్న లవాణి పట్టా 450 ఎకరాల భూమిలో కొంత స్థలంలో డబుల్ బెడ్ రూమ్స్ నిర్మించారు.మిగతా 410 ఎకరాల్లో ఉన్న రైతులకు ఎలాంటి నష్ట పరిహారం ఇవ్వకుండ తీసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఇదే సర్వే నంబర్లలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 600 మందికి 60 గజాల ఇందిరమ్మ పట్టాలు కూడా ఇచ్చింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఈ భూమికి పట్టాలు ఇప్పిస్తామని రేవంత్ రెడ్డి హామీ కూడా ఇచ్చారనీ.. ఇప్పుడు లాక్కొనే ప్రయత్నం చేస్తున్నారనీ.. తెలియడంతో అక్కడికి వెళ్ళిన బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ రైతులకు అండగా నిలిచారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఈ భూముల్లో 40 ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటున్నారు.. ఈ భూముల్ని ఇష్టం వచ్చినట్టు తీసుకోవచ్చని అధికారులు చెప్తున్నారు.. ఏమనుకుంటున్నారు?.. కేసీఆర్ ప్రభుత్వం కూడా ఇలానే చేసి నాశనం అయింది.. అసైన్డ్ భూములను ఇష్టం వచ్చినట్లు లాక్కొనే అధికారం ఎవరికి లేదు.. రింగ్ రోడ్డు అప్పుడు కూడా ఇలానే అసైన్మెంట్ భూములకు రూపాయి ఇవ్వకుండా గుంజుకుంటుంటే రాజశేఖర్ రెడ్డితో కొట్లాడాం.. పట్టా భూములతో సమానంగా అసైన్డ్ భూములకు కూడా నష్టపరిహారం ఇచ్చే వరకు వదిలి పెట్టలేదని చెప్పారు. ప్రభుత్వానికి అవసరమైతే అది కూడా ప్రజల కోసం అయితే నష్ట పరిహారం ఇచ్చి తీసుకోవాలి.. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ బ్రోకర్ కాదు.. గద్దల్లాగా వచ్చి ప్రజల్ని అదరగొట్టి బెదరగొట్టి పోలీసుల సహాయంతో పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే మంచిగా



ఉండదు.. నేను ఇక్కడ ఎంపీగా ఉన్నా.. అసైన్డ్ భూములు ఒక్క సంవత్సరం కోసం ఇవ్వరు.. తాత జాగీర్ లాగా ప్రజలను ఇబ్బంది పెట్టవద్దు అని ఈటల రాజేందర్ మండిపడ్డారు.ఇక, అవసరమైతే ప్రజల తరపున నేనే కోర్టుకు పోతాను అని ఈటల రాజేందర్ తెలిపారు. దద్దమ్మల లెక్క ఉంటే గద్దల లెక్క తనకు పోతారు.. అనేక రాష్ట్రాల్లో15 ఏళ్లు దాటిన తర్వాత అసైన్డ్ భూములపై సంపూర్ణ హక్కులు ఇచ్చేస్తారు.. తమిళనాడు, యూపీలో ఇలాగే చేశారు.. కేసీఆర్ కూడా ఇస్తానని ఇవ్వలేదు.. కడు బీదరికంలో ఉన్న వారికి ఈ భూమి ఇచ్చారు.. రియల్ ఎస్టేట్ బ్రోకర్ లాగా వ్యవహరించమని కాదు మీకు ఓట్లు వేసింది.. నేను మీ వెంట ఉంటా.. భూములు గుంజుకుంటె చూస్తూ ఊరుకునేది లేదు.. పేదలను వేధించే అధికారం ఎవరికీ లేదు.. వారికి ఎవరూ దిక్కులేదని అనుకోవద్దు.. ఈ భూములు అమ్ముకుంటే రెస్యూమ్ చేయండి.. కానీ గుంజుకుంటా అంటే ఊరుకునేది లేదంటూ అధికారులపై మల్కాజ్ గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రోడ్డు ప్రాజెక్టులకు అటవీ అనుమతుల్లో జాప్యం

**శాసనసభ / హైదరాబాద్ ప్రతినిధి :** అటవీ అనుమతుల మంజూరులో కేంద్ర ప్రభుత్వ వైఖరి కారణంగా రాష్ట్రంలో 59 రోడ్డు ప్రాజెక్టులు ఆగిపోయాయని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు.శనివారం సచివాలయంలోని మంత్రి కోమటిరెడ్డి చాంబర్‌లో ఇరువురు సమీక్ష నిర్వహించారు. కేంద్రం నుంచి అనేక రోడ్లకు అనుమతులు సాధించినా అటవీ అనుమతుల్లేక ఆగిపోవడంతో.. కొత్త రోడ్ల మంజూరు కోసం అడగడం ఇబ్బందిగా మారిందని కోమటిరెడ్డి తెలిపారు. రాష్ట్రానికి మరిన్ని జాతీయ రహదారులను మంజూరు చేయించాలంటే ఇప్పటికే మంజూరైన రోడ్లను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. తక్షణమే అటవీ అనుమతులు సాధించేందుకు శాఖల మధ్య సమన్వయం కోసం అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.దీనిని పర్యవేక్షణకు ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో ఎస్‌ఈ స్థాయి అధికారిని ప్రత్యేకంగా నియమించనున్నట్లు తెలిపారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. డీఎఫఓల స్థాయిలో ఉన్న 11 అటవీ అనుమతుల ఫైళ్ల ఆలస్యంపై



అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అటవీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ఫైళ్ల క్లియరెన్స్‌లో ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో పూర్తి చ్టేసలా చర్యలు తీసుకుంటామని మంత్రి కోమటిరెడ్డికి హామీ ఇచ్చారు. అనుమతులను వేగంగా సాధించేందుకు ఉమ్మడి జిల్లాల వారీగా పర్యవేక్షణ అధికారులను నియమించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ డోబ్రియల్‌కు ఆదేశాలు జారీ చేశారు. డిసెంబరు చివరికల్లా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌పై ఒక స్లాబ్‌ను పూర్తి చేయాలని మోర్త్ ఆర్వో కృష్ణప్రసాద్, ఎస్‌ఈ ధర్మారెడ్డికి మంత్రి కోమటిరెడ్డి సూచించారు.

# ఎవరెస్టును అధిరోహించిన ఏపీ అధ్యాపకులు, విద్యార్థుల బృందం



**శాసనసభ / అమరావతి :** ఏపీకి చెందిన పలువురు అధ్యాపకులు, విద్యార్థులు ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి రికార్డు సృష్టించారు. అమరావతిలోని ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీకి చెందిన అధ్యాపకులు, విద్యార్థుల బృందం ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించింది.యూనివర్సిటీ డైరెక్టర్ సిద్ధార్థ త్రిపాఠి నేతృత్వంలో మొత్తం 18 మంది అధ్యాపకులు, విద్యార్థులు ఈనెల 11న అమరావతి నుంచి బయలుదేరారు. అక్టోబర్ 20న ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించారు. ఈ బృందంలో గుంటూరు విద్యానగర్‌కు చెందిన చందన ఉన్నారు. ఆమె ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతోంది. హిమాలయాలను అధిరోహించిన దేశంలోని తొలి ప్రైవేట్ విద్యాసంస్థ బృందం తమదేనని యూనివర్సిటీ ప్రతినిధులు తెలిపారు.

# నాపై దుష్ప్రచారం చేస్తే పరువు నష్టం దావా వేస్తా: జగ్గారెడ్డి




**శాసనసభ / సంగారెడ్డి:** మాజీ ఎమ్మెల్యే, సీనియర్ కాంగ్రెస్‌నేత జగ్గారెడ్డి పాత వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు.ఏడుకొండలు ఫిర్యాదు మేరకు వీడియో వైరల్ చేసిన శంకర్‌ను సంగారెడ్డి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ అంశంపై జగ్గారెడ్డి తీవ్రంగా స్పందించారు. "మూడేళ్ల క్రితం సంగారెడ్డి కలెక్టర్‌ను ఉద్దేశించి మాట్లాడిన మాటలను ఎడిట్ చేశారు. అప్పటి వ్యాఖ్యలను ఎడిట్ చేసి ప్రస్తుత కలెక్టర్‌ను ఉద్దేశించి మాట్లాడినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు. నాపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై, యూట్యూబ్ ఛానెల్స్, సోషల్ మీడియా ఖాతాల నిర్వాహకులపై పరువు నష్టం దావా వేస్తా" అని జగ్గారెడ్డి హెచ్చరించారు.

# బడ్‌వైజర్ బీర్‌లో చనిపోయిన బల్లి..



**శాసనసభ / హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఓ షాకింగ్ వీడియో బయటపడింది. ఇది బీర్ తాగేవారిని షాక్‌కు గురిచేసింది. ఓ వ్యక్తి స్థానిక మద్యం దుకాణం నుంచి బీర్ బాటిల్‌ను కొనుగోలు చేశాడు.అందులో చనిపోయిన బల్లి తేలియాడుతూ.. కనిపించింది. ఇది చూసిన ఆ వ్యక్తికి చేదు అనుభవం ఎదురైంది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చాలా వేగంగా వైరల్ అవుతోంది.వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం కెరెల్లి గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్ రెడ్డి, అతడి ఫ్రెండ్ అనంతయ్య ఇద్దరు కలిసి పార్టీ చేసుకుందామని దగ్గరలోని ఓ వైన్ షాపులో రూ.4వేలు విలువైన మద్యం కొనుగోలు చేశారు. ఇంటికెళ్లి బాటిల్ ఓపెన్ చేద్దామని చూడగానే దిమ్మ తిరిగింది. ఓ బడ్‌వైజర్ బీర్ బాటిల్‌లో ఏదో తేలియాడుతూ కనిపించింది. తీరా చూస్తే బీరు బాటిల్ లో ఉన్నది బల్లి అని తెలిసింది. వెంటనే అతను బాటిల్ ను ఓపెన్ చేయకుండానే వైన్ షాప్ కెళ్లి యజమానికి చూపించి నిలదీశాడు. ' మాకు కంపెనీ నుంచి అలాగే వచ్చింది.. మేము తయారు చేయలేదుగా.. మేమేం చేయాలి.' అని సమాధానమిచ్చాడు. దీంతో నిరాశకు లోనైన కస్టమర్ వీడియో తీసి.. సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీంతో వీడియో వైరల్ గా మారింది.కస్టమర్లు ఇలాంటి అనుభవాన్ని ఎదుర్కోవడం ఇదేం మొదటిసారి కాదు. ఇది ఇంతకు ముందు కూడా జరిగింది. దీనిపై సోషల్ మీడియాలో చాలా ఆగ్రహం కనిపించింది. గతేడాది హైదరాబాద్‌లోని ఓ స్థానిక రెస్టారెంట్‌లో ఆర్డర్ చేసిన బిర్యానీలో చనిపోయిన బల్లి కనిపించింది. కొన్ని రోజుల క్రితం కూడా బీరు డబ్బాలో చనిపోయిన బొద్దింక కనిపించింది.

# ప్రజా పాలన అంటే.. ఇదేనా రేవంత్ రెడ్డి..?



**శాసనసభ / హైదరాబాద్ :** కానిస్టేబుల్స్ కుటుంబాలు రోడ్డు మీదకు రావటానికి సీఎం రేవంత్ కారణమని ఆరోపించారు మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి.ఇవాళ తెలంగాణ భవన్ లో సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. హోంశాఖ నిర్వహిస్తోన్న రేవంత్ ఫెయిల్ అవ్వటం వలనే పోలీస్ కుటుంబాలు బయటకు వచ్చాయని, రక్షకభటులే న్యాయం కావాలని రోడ్డు ఎక్కటం బాధాకరమన్నారు. పోలీసులు రోడ్డు ఎక్కటం చరిత్రలోనే మెదటసారి అని ఆమె వ్యాఖ్యానించారు. ప్రజా పాలన అంటే.. ఇదేనా రేవంత్ రెడ్డి? అని ఆమె ప్రశ్నించారు. హోంమంత్రి లేకపోవటం వలన.. కానిస్టేబుల్స్ బాధ ఎవరకి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి అని, యూనిఫాం వేసుకుని ధర్నాలు చేయాల్సిన పరిస్థితి తెలంగాణలో వచ్చిందని ఆమె మండిపడ్డారు.అంతేకాకుండా.. అయినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడం బాధాకరమని సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు. ఏక్ పోలీస్ వ్యవస్థపై సీఎం రేవంత్ మాటను నిలబెట్టుకోవాలని, 18రోజులకు%% 4రోజులు కుటుంబంతో గడిపే పాత పద్ధతిని కొనసాగించాలన్నారు. పిల్లలు కూడా తండ్రులను గుర్తుపట్టని పరిస్థితులు పోలీస్ కుటుంబాలవని, మహిళలపై అఘాయిత్యాలు రాష్ట్రంలో సర్వసాధారణంగా మారాయన్నారు సబితా ఇంద్రారెడ్డి. డీజీపీ స్థాయి అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు.

TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867
శాసనసభ
తెలుగు దినపత్రిక
ఆదివారం 27 అక్టోబర్ - 2024



## సమంత వెబ్‌సిరీస్.. ఆ హాలీవుడ్ మూవీ స్ఫూర్తి?: డైరెక్టర్ ఏమన్నారంటే?

సమంత, బాలీవుడ్ నటుడు వరుణ్ ధావన్ ప్రధాన పాత్రల్లో దర్శకులు రాజ్, డీకే రూపొందించిన వెబ్‌సిరీస్ 'సిటాడెల్: హనీ- బన్నీ'.నవంబరు 7 నుంచి ఓటీటీ 'అమెజాన్ ప్రైమ్ వీడియో' లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్లతోపాటు రచయిత సీతా ఆర్. మేనన్ ఓ మీడియా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. "సిటాడెల్' ట్రైలర్ విడుదలయ్యాక .. హాలీవుడ్ మూవీ 'మిస్టర్ అండ్ మిసెస్ స్మిత్'తో పోల్చారు. నిజంగానే స్ఫూర్తి పొందారా?" అన్న ప్రశ్నపై రాజ్ స్పందించారు. రెండింటికీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. మేం ఎప్పుడూ అలా చేయలేదన్నారు."మా గత సిరీస్ 'ది ఫ్యామిలీమ్యాన్'కు పూర్తిభిన్నంగా ఈ కొత్త సిరీస్ ఉండాలనుకున్నాం. ఆ సిరీస్‌లోని ఛాయలేవీ 'సిటాడెల్'లో కనిపించకూడదని నిర్ణయించుకున్నాం. అదొక ఫిక్షనల్ యూనివర్స్. అందులో స్పై ఏజెన్సీలున్నా ప్రభుత్వానికి చెందినవి కాదు. సీతా మేనన్ ఆలోచనల్లోంచి వచ్చిన పాత్రలే హనీ (సమంత), బన్నీ (వరుణ్). రెండు పాత్రలకూ అధిక ప్రాధాన్యం ఇచ్చారు" అని రాజ్, డీకే తెలిపారు. "వేరే ఫిల్మ్ మేకర్స్‌తో మేం పోటీ పడడం లేదు. వారితో పోటీ ఉందని మేం అనుకోవడం లేదు"సీతా మేనన్ మాట్లాడుతూ.కథాలోచనలు చెప్పా. వాటిలో ఒకటి ఎంపిక చేసుకున్నారు. ముగ్గురం కలిసి స్క్రిప్ట్ రెడీ చేశాం. దాదాపు ఐదేళ్ల సమయం పట్టింది" అని అన్నారు.

## 37 రోజుల్లో..: జానీ మాస్టర్ ఎమోషనల్ పోస్ట్





37 రోజుల్లో మేం (ఫ్యామిలీని ఉద్దేశిస్తూ) ఎంతో మిస్ అయ్యామంటూ జానీ మాస్టర్ సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు.జైలు నుంచి ఇంటి తిరిగొచ్చిన సమయంలో కుటుంబ సభ్యుల స్పందనకు సంబంధించిన వీడియో పంచుకున్నారు. "నా కుటుంబం, శ్రేయోభిలాషుల ప్రార్థనల వల్ల ఈ రోజు ఇక్కడ ఉన్నా. నిజం అనేది ఏదో ఓ రోజు తప్పక బయటపడుతుంది. నా ఫ్యామిలీ పడిన కష్టం.. ఎప్పటికీ నన్ను వేదనకు గురిచేస్తూనే ఉంటుంది" అని పేర్కొన్నారు.సహాయ నృత్య దర్శకురాలు ఇచ్చిన ఫిర్యాదుతో అరెస్టయి చంచల్‌గూడ జైల్లో విచారణ ఖైదీగా ఉన్న జానీ మాస్టర్ శుక్రవారం సాయంత్రం బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే. గత నెల 19న జానీ మాస్టర్‌ను గోవాలో అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. మొదట రంగారెడ్డి పోక్సో న్యాయస్థానంలో బెయిల్ కోసం ఆయన ప్రయత్నించగా అనుమతి లభించలేదు. మరో పిటిషన్‌తో ఆయనకు గురువారం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం జైలు అధికారులు జానీ మాస్టర్‌ను విడుదల చేశారు. మరోవైపు, పోక్సో చట్టం కింద కేసు నమోదవడంతో ఆయనకు ప్రకటించిన జాతీయ అవార్డును నిలిపివేస్తున్నట్లు అవార్డుల కమిటీ కొన్ని రోజుల క్రితం ప్రకటించింది.

## గేమ్ చేంజర్ నుంచి లేటెస్ట్ అప్డేట్




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'గేమ్ చేంజర్' . సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ తెరకెక్కిస్తున్న ఈ మోస్ట్ వెయిటెడ్ సినిమాలో..కియారా అద్వాని హీరోయిన్ కాగా..అంజలి, సముద్రఖని, ఎస్‌జె సూర్య, శ్రీకాంత్, సునీల్, జయరాం, నవీన్ చంద్ర తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అత్యంత భారీ బడ్జెట్‌తో శ్రీమతి అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ ) నిర్మిస్తున్నారు. అయితే.. 2024 క్రిస్మస్ కానుకగా..ఈ చిత్రం డిసెంబర్ 20న రిలీజ్ కావాల్సి ఉండగా పోస్ట్ పోన్ అయ్యి.. సంక్రాంతి స్పెషల్‌గా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే.అయితే.. క్రిస్మస్ కు వస్తుంది అనుకున్న చిత్రం పోస్ట్ పోన్ కావడంతో రామ్ చరణ్ ఫ్యాన్స్‌లో కాస్త నిరుత్సాహం వచ్చింది. దీంతో..

## 'అమరన్' కోసం కల్కి దర్శకుడు





కోలీవుడ్ స్టార్ నటుడు శివ కార్తికేయన్ తన తదుపరి ప్రాజెక్ట్ ని రాజ్‌కుమార్ పెరియసామితో చేస్తున్న సంగతి అందరికి తెలిసిందే. ఈ చిత్రానికి మూవీ మేకర్స్ 'అమరన్' అనే టైటిల్ ని లాక్ చేసారు.ఈ సినిమాలో సాయి పల్లవి కథానాయికగా నటిస్తుంది. రాహుల్ బోస్ మరియు భువన్ అరోరా ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా "మేజర్ వరదరాజన్" నుండి ప్రేరణ పొందింది. ఈ సినిమా యొక్క ప్రీ రిలీజ్ ఈవెంట్ ఈరోజు సాయంత్రం 6 గంటల నుండి హైదరాబాద్ లోని ITC ఖోహినూర్ లో జరుగనుంది.తాజాగా చిత్ర బృందం ఈ ఈవెంట్ కి కల్కి దర్శకుడు నాగశ్విన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు సమాచారం.ఈ విషయాన్ని తెలియజేసేందుకు మూవీ మేకర్స్ సోషల్ మీడియాలో సరికొత్త పోస్టర్ ని విడుదల చేసారు. ప్రత్యేకమైన యాక్షన్ మరియు ఎమోషన్ మిళితమై, "అమరన్" ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరిస్తుందని భావిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్ రాజీవ్, సినిమాటోగ్రాఫర్ CH సాయి, ఎడిటర్ R. కలైవానన్ మరియు యాక్షన్ డైరెక్టర్లు అన్బరివ్ మాస్టర్స్‌తో పాటు స్టీఫన్ రిక్టర్‌తో సహా అమరన్ అగ్రశ్రేణి సాంకేతిక బృందంతో ఉంది. జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన అమరన్ దేశభక్తి చిత్రం. ఈ సినిమా అక్టోబరు 31, 2024న గ్రాండ్ మల్టీ-లాంగ్వేజ్ విడుదలకు సిద్ధంగా ఉంది. సోనీ పిక్చర్స్ ఫిల్మ్స్ ఇండియా సహకారంతో రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

## నేడే 'కంగువ' ఆడియో లాంచ్




కోలీవుడ్ స్టార్ నటుడు సూర్య తన తదుపరి సినిమాని శివ దర్శకత్వంలో చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి అందరికి తెలిసిందే. ఈ సినిమాకి మూవీ మేకర్స్ 'కంగువ' అనే టైటిల్ ని లాక్ చేసారు.ఈ మాగ్నమ్ ఓపస్ విడుదల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా మూవీ మేకర్స్ ఈ సినిమా యొక్క ఆడియో లాంచ్ ఈవెంట్ ని ఈరోజు చెన్నై లోని నెహ్రూ ఇన్డోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని తెలియజేసేందుకు చిత్ర బృందం సోషల్ మీడియాలో సరికొత్త పోస్టర్ ని విడుదల చేసింది. ఈ చిత్రంలో దిశా పాటని కథానాయికగా నటిస్తుంది.బాబీ డియోల్, యోగి బాబు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రం యొక్క బడ్జెట్ మూడు వందల కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఈ సినిమా నవంబర్ 14న విడుదల కానుంది. ఈ సినిమా అన్ని భాషలలో 3%న% ఫార్మటు లో విడుదల కానుంది. ఈ యాక్షన్ డ్రామా గత జన్మల కాన్సెప్ట్‌తో రూపొందింది. ప్రొడక్షన్ హౌస్ స్టూడియో గ్రీన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది.




## ఆ విషయంలో ఒత్తిడి లేదు.. కాస్మోటిక్ సర్జరీలపై కృతి కామెంట్స్

హీరోయిన్‌గా అలరిస్తూనే నిర్మాతగానూ విజయం సాధించారు నటి కృతి సనన్ .'దో పత్తి'అనే చిత్రాన్ని నిర్మించి నిర్మాతగా తొలి హిట్‌ను అందుకున్నారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. హీరోయిన్స్ కాస్మోటిక్ సర్జరీలు చేయించుకోవడంపై తన అభిప్రాయాన్ని తెలియజేశారు.'మహిళలు ఎప్పుడూ అందంగా కనిపించాలని వారిపై ఒత్తిడి తీసుకురాకూడదు. అందంగా కనిపించడం కోసం శరీరభాగాలకు సర్జరీలు చేయించుకొనే వారి విషయంలో నేను తీర్పు ఇవ్వలేను. అది పూర్తిగా వారి సొంత నిర్ణయం. శరీరంలో ఒక భాగంలో మార్పు వచ్చినంతమాత్రాన అందంగా కనిపిస్తామన్న నమ్మకం మీకు ఉంటే ఏమైనా చేయించుకోవచ్చు. మీరు తీసుకున్న నిర్ణయం వల్ల వచ్చే సమస్యలను కూడా మీరే ఎదుర్కోవాల్సి ఉంటుంది. మీ జీవితం, మీ ముఖం, నేను అలాంటి విషయాల్లో సలహాలు ఇవ్వను. నేను అందం విషయంలో ఎప్పుడూ ఒత్తిడికి గురికాలేదు. మానసికంగా ఆనందంగా ఉంటే అదే మన ముఖంలో కనిపిస్తుంది.అందుకే ఎప్పుడూ ప్రశాంతంగా ఉండడానికి ప్రయత్నిస్తా.నేను తీసుకునే ఫొటోలకు కూడా ఫిల్టర్లు ఉపయోగించను' అని చెప్పారు.కృతి సనన్ ప్రధాన పాత్రలో నటించి నిర్మించిన 'దో పత్తి' తాజాగా నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలై మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో కృతి ద్విపాత్రాభినయంలో కనిపించారు. శశాంక చతుర్వేది దర్శకత్వం వహించారు. కవలలైన అక్కా చెల్లెళ్ల గురించిన రహస్యాలను వెలికితీసే పోలీసు అధికారి పాత్రలో కాజోల్ నటించారు. 'బ్లూ బటర్ ఫ్లై ఫిల్మ్స్' పతాకంపై కృతి నిర్మించిన తొలి చిత్రమిది. షహీర్‌షేక్, తన్వీ అజ్మీ, బ్రిజేంద్ర కాలా కీలకపాత్రలు పోషించారు.

## 92 ఏళ్ల చరిత్రలో.. తొలి భారత బ్యాటర్‌గా యశస్వి జైస్వాల్ రికార్డు




న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టెస్టులో టీమ్‌ఇండియా 113 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. 359 పరుగుల లక్ష్యఛేదనలో యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ (77బీ 65 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒక్కడే అర్ధ శతకం బాదాడు.మిగతా ఆటగాళ్లు రాణించలేదు. దీంతో భారత్ 245 పరుగులకు ఆలౌటైంది. ఈ ఇన్నింగ్స్‌లో మూడు సిక్స్‌లు బాదడం ద్వారా జైస్వాల్ అద్భుతమైన రికార్డు సొంతం చేసుకున్నాడు. టెస్టుల్లో ఒక క్యాలెండర్ ఇయర్‌లో 30 కంటే ఎక్కువ సిక్స్‌లు బాదిన తొలి భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఓవరాల్‌గా ఈ ఫీట్ అందుకున్న రెండో బ్యాటర్‌గా నిలిచాడు. న్యూజిలాండ్ మాజీ ఆటగాడు బ్రెండన్ మెక్‌కల్లమ్ (33 సిక్స్‌లు) అగ్రస్థానంలో ఉన్నాడు. అతడు 2014లో 33 సిక్సర్లు బాదాడు. ఈ ఏడాది ఇప్పటివరకు యశస్వి జైస్వాల్ 32 సిక్స్‌లు కొట్టాడు. ఈ యువ బ్యాటర్ మరో రెండు సిక్సర్లు బాదితే మెక్‌కల్లమ్ రికార్డును బ్రేక్ చేస్తాడు. న్యూజిలాండ్‌తో మూడో టెస్టు, తర్వాత ఆస్ట్రేలియాతో బోర్డర్-గావస్కర్‌లో యశస్వి ఆడనున్నాడు. దీంతో అతడు మెక్‌కల్లమ్ రికార్డును సునాయంసగా బ్రేక్ చేయడం ఖాయం.ఈ ఏడాది టెస్టుల్లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న జైస్వాల్ 19 ఇన్నింగ్స్‌ల్లో 1084 పరుగులు చేశాడు. ఈ క్రమంలో స్వదేశంలోనే వెయ్యికిపైగా పరుగులు చేసిన మూడో భారత ఆటగాడిగా నిలిచాడు. అతడికంటే ముందు గుండప్ప విశ్వనాథ్ (1979లో), సునీల్ గావస్కర్ (1979లో) మాత్రమే టీమ్‌ఇండియా బ్యాటర్లుగా స్వదేశంలో 1000ంకి పైగా పరుగులు రాబట్టారు. భారత్, న్యూజిలాండ్ మధ్య మూడో టెస్టు నవంబర్ 1 నుంచి ముంబయి వేదికగా ప్రారంభంకానుంది. నవంబర్ 22 నుంచి బోర్డర్-గావస్కర్ సిరీస్ మొదలవనుంది. ఈ సిరీస్ కోసం ఇప్పటికే భారత జట్టును ప్రకటించారు.

## వల పన్ని.. అదే ఉచ్చులో పడ్డ టీమ్‌ఇండియా




సొంతగడ్డపై వరుస టెస్టు సిరీస్ విజయాలతో దూసుకుపోతున్న టీమ్‌ఇండియా కు కివీస్ ఊహించని షాక్ ఇచ్చింది. స్వదేశంలో వరుసగా 18 టెస్టు సిరీస్‌లు సాధించిన భారత జట్టుకు 12 ఏళ్ల తర్వాత ఓటమి రుచి చూపించింది.పుణె వేదికగా జరిగిన రెండో టెస్టులో న్యూజిలాండ్ 113 పరుగుల తేడాతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. పర్యటక జట్లను స్పిన్ ఆయుధంతోనే దెబ్బ కొట్టే టీమ్‌ఇండియా ఈ సారి ఆ స్పిన్ ఉచ్చుకే బలైంది. ఆస్ట్రేలియాలో బోర్డర్-గావస్కర్ ట్రోఫీని దృష్టిలో ఉంచుకుని ఇటీవల ఇక్కడి పిచ్‌లను పేస్‌కు అనుకూలంగా తీర్చిదిద్దుకుంది టీమ్‌ఇండియా. బెంగళూరులో న్యూజిలాండ్ తో జరిగిన తొలి టెస్టులో ఈ ప్రయోగం బెడిసికొట్టింది. పుణె టెస్టులో మళ్లీ సంప్రదాయ స్పిన్ పిచ్ వైపు మొగ్గుచూపిన భారత్‌కు షాక్ తప్పలేదు. కివీస్‌ను స్పిన్‌తో చుట్టేయాలని ప్లాన్ చేసిన టీమ్‌ఇండియా.. ప్రత్యర్థి విసిరిన అదే అస్త్రాన్ని ఎదుర్కొలేక చతికిలపడింది. ప్రధాన బ్యాటర్లలో యశస్వి జైస్వాల్ ఒక్కడే రాణించగా మిగతా వారంతా స్పిన్ ఆడలేక చేతులెత్తేశారు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి స్పిన్నర్ మిచెల్ శాంట్నర్ 13 వికెట్లు పడగొట్టగా.. మరో ఇద్దరు స్పిన్నర్లు గ్లెన్ ఫిలిప్స్ 3, అజాజ్ పటేల్ 2 వికెట్లు పడగొట్టారు.ఇటీవల బంగ్లాదేశ్ స్పిన్నర్లపై చెలరేగిన భారత బ్యాటర్లు మిచెల్ శాంట్నర్ బౌలింగ్‌లో బ్యాటింగ్ చేయడానికి నాన అవస్థలు పడ్డారు. ఐపీఎల్‌లో అతడి బౌలింగ్‌లో ఆడిన అనుభవం ఉన్నా కనీసం ఎదురుదాడికి దిగకుండా పేలవమైన షాట్లు ఆడి వికెట్లు సమర్పించుకున్నారు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ శాంట్నర్ బౌలింగ్‌లోనే వెనుదిరిగాడు. తొలి ఇన్నింగ్స్‌లో శాంట్నర్ సంధించిన ఫుల్ టాస్ బంతిని ఆన్ సైడ్‌కు ఆడేందుకు ప్రయత్నించిన కెరీర్‌లోనే అత్యంత దారుణంగా క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. సెకండ్ ఇన్నింగ్స్‌లో బంతిని డిఫెన్స్ చేయబోయి వికెట్ల ముందు దొరికిపోయాడు. స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కొలేక భారత బ్యాటర్లు చేతులెత్తేయగా కివీస్ బ్యాటర్లలో డేవాన్ కాన్వే, రచిన్ రవీంద్ర, టామ్ లేథమ్, బ్లండెల్, గ్లెన్ ఫిలిప్స్ చక్కగా బ్యాటింగ్ చేశారు. వాషింగ్టన్ సుందర్ ఒక్కడే ప్రత్యర్థి బ్యాటర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. భారత గడ్డపై తిరుగులేని రికార్డున్న రవీంద్ర జడేజా, అశ్విన్ పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. స్వదేశంలో టీమ్‌ఇండియాకు స్పిన్ అస్త్రం బెడిసికొట్టడం ఇది కొత్తేమీకాదు. 2023లో ఇండోర్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్, 2024లో హైదరాబాద్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్, 2021లో చెన్నైలో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రత్యర్థి స్పిన్నర్ల దెబ్బకు భారత్ కంగుతింది.కివీస్‌తో సిరీస్‌ను చేజార్చుకోవడంతో భారత్‌కు ఇక ప్రతి మ్యాచూ కీలకమే. ఈ డబ్ల్యూటీసీలో టీమ్‌ఇండియా ఇంకా ఆరు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇందులో ఒకటి న్యూజిలాండ్‌తో కాగా.. మిగిలిన ఐదు మ్యాచ్‌ల్లో ఆసీస్‌తో తలపడాల్సి ఉంది. ఈ ఆరు మ్యాచ్‌ల్లో నాలుగు గెలిస్తేనే టీమ్‌ఇండియా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరే అవకాశముంది. సాధారణంగా ఆస్ట్రేలియా పిచ్‌లు పేస్ బౌలింగ్‌కు అనుకూలిస్తాయి. అక్కడ భారత పేసర్లు ఏ మేరకు రాణిస్తారో చూడాలి. ఒకవేళ పిచ్‌లు క్రమంగా స్పిన్‌కు సహకరించినా నాథన్ లైయన్ వంటి బలమైన స్పిన్నర్ జట్టులో ఉండటం ఆసీస్‌కు ప్లస్ పాయింట్.

## న్యూజిలాండ్‌తో రెండో టెస్టు.. ఏడు వికెట్లు డౌన్.. కష్టాల్లో భారత్




న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో టీమ్‌ఇండియా కష్టాల్లో పడింది. 359 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్.. మూడో రోజు టీ విరామ సమయానికి ఏడు వికెట్లు కోల్పోయి 178 పరుగులు చేసింది.రవీంద్ర జడేజా (4), అశ్విన్ (9) క్రీజులో ఉన్నారు. 81/1తో రెండో సెషన్‌ను ఆరంభించిన భారత జట్టు.. ఈ సెషన్‌లో 97 పరుగులు చేసి 6 వికెట్లు కోల్పోయింది. లంచ్ బ్రేక్ అనంతరం భారత్ వరుసగా శుభ్‌మన్ గిల్ (23), యశస్వి జైస్వాల్ (77), రిషభ్ పంత్ (0), విరాట్ కోహ్లీ (17), సర్ఫరాజ్ ఖాన్ (9), వాషింగ్టన్ సుందర్ (21) వికెట్లను చేజార్చుకుంది.భారత్ విజయానికి ఇంకా 181 పరుగులు అవసరం. న్యూజిలాండ్ బౌలర్లలో శాంట్నర్ 5, గ్లెన్ ఫిలిప్స్ ఒక వికెట్ తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 259, భారత్ 156 పరుగులు.. రెండో ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 255 పరుగులు చేసిన విషయం తెలిసిందే.

PMR Publication,Thurkayamjal 4-136/12, 9100900918